క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి..

● సీఐ మురళీధర్



పార్వతీపురంటౌన్: ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, తదితర ప్లాట్‌ఫారాల్లో ట్రేడింగ్‌లో ఉచిత మెలకువలు ఇస్తామని ప్రకటనలు ఇస్తారని.. బాధితులు తెలియకుండా ఆ ప్రకటనల లింక్‌లను క్లిక్ చేయగానే వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులకు మళ్లించబడతారని చెప్పారు. వెంటనే మోసగాళ్లు బాధితులతో మాట్లాడుతూ, మోసపూరిత హామీలతో డబ్బులు దోచుకుంటారని తెలిపారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట నకిలీ డిజిటల్ వాలెట్‌లో డబ్బులు వచ్చినట్లు చూపించి మోసాలకు పాల్పడతారని చెప్పారు. కాబట్టి అనుమానాస్పద లింక్‌లకు స్పందించకుండా ఉండడం మంచిందని సూచించారు.

20 నుంచి పశువైద్యశిబిరాలు

సీతానగరం: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా ఈ నెల 20 నుంచి 31 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశువుల ఆరోగ్య పరిరక్షణకు ఆయా మండలాలకు చెందిన పశువైద్యాధికారుల పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తోందన్నారు. శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో రైతులకు పశుగ్రాసం, పశు పెంపకం, బీమా పథకం, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాదకర మలుపు



ప్రమాదాలకు నిలయంగా మారిన మలుపు ప్రాంతం ఇదే

సాలూరు: మండలంలోని జీగిరాం సమీపంలో జాతీయ రహదారి 26కు అనుసంధానమయ్యే సాలూరు బైపాస్ రోడ్డు మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. సాలూరు బైపాస్ రోడ్డు నుంచి ఓ వైపు.. ఒడిశా నుంచి మరోవైపు వచ్చే వాహనాలతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. దీంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రాంతం వద్ద స్పీడ్ బ్రేకర్లు గాని, హెచ్చరిక బోర్డులు గాని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నివాళి..



ఆస్పత్రి వద్ద నివాళులర్పిస్తున్న 108 సిబ్బంది, వైద్యులు

పార్వతీపురం టౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 108 ఈఎంటీ లోలుగు రాంబాబుకు సహచర సిబ్బంది నివాళులర్పించారు. రాంబాబు తన భార్యాపిల్లలతో కలసి గురువారం సాయంత్రం జియ్యమ్మవలస మండలం అల్లువాడ నుంచి పార్వతీపురం వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. సరిగ్గా పార్వతీపురం మండలం నర్సిపురం వద్దకు వచ్చేసరిగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబుతో పాటు అతని కుమారుడు మోక్ష శ్రీహాన్ మృతి చెందారు. మృతదేహాలకు స్థానిక జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సిబ్బంది ఆస్పత్రికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి..

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్



పార్వతీపురం టౌన్: వలంటీర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ని కూటమి నాయకులు నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వలంటీర్లకు న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. వలంటీర్లు గుంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఎన్నికల సమయంలో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నారని చెప్పారు. 2,60,000 మంది చిరుద్యోగులకు న్యాయం చేయలేని సర్కారు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం నమ్మశక్యంగా లేదని ఎద్దేవా చేశారు. వెంటనే ప్రభుత్వ పాలకులు స్పందించి వలంటీర్లకు రూ. పది వేల జీతం ప్రకటిస్తూ, విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

కాంప్లెక్స్ పోయే.. క్లస్టర్ విధానం వచ్చే..

● ఆరు స్కూల్ కాంప్లెక్స్‌లను మూడు క్లస్టర్లుగా విలీనం
● క్లస్టర్ హెచ్‌ఎంలకు అధికారాలు

బలిజిపేట:

విద్యాశాఖకు సంబంధించి పాఠశాల సముదాయాల స్థానంలో (కాంప్లెక్స్) క్లస్టర్ విధానాన్ని అమలు చేయాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బలిజిపేట మండలంలో ఉన్న ఆరు పాఠశాల సముదాయాల స్థానంలో మూడు క్లస్టర్లు ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రతి క్లస్టర్‌కు గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 10 నుంచి 15 పాఠశాలలను అనుసంధానం చేసేలా విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. క్లస్టర్‌లో 40 నుంచి 50 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఇకపై ప్రతినెలా పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు కొత్త విధానంలో నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, పాఠశాలల మధ్య విద్య అనుసంధానం, విద్యా వనరుల సామగ్రి తయారీ, తనిఖీలు, విద్యావ్యవస్థ పర్యవేక్షణ, తదితర కార్యక్రమాలు క్లస్టర్ కేంద్రంగా నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● హెచ్‌ఎంలే కీలకం..

కొత్త విధానంలో క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కీలకంగా మారనున్నారు. మండల యూనిట్‌లో ప్రస్తుతం డీడీఓ అధికారాలు ఎంఈఓలకు ఉండగా.. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి త్వరలో క్లస్టర్ స్కూల్ హెచ్‌ఎంకు జీతాల పంపిణీ అధికారం బదలాయింపు చేయనున్నారు. ఎంఈఓలు పరిపాలనా సంబంధ అంశాలకు మాత్రమే పరిమితం కానున్నారు. క్లస్టర్ స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులపై ప్రస్తుతం ఉన్న రోజువారీ విధులకు అదనంగా క్లస్టర్ నిర్వహణ భారం పడడంతో పాటు ఎంఈఓలు నిర్వహిస్తున్న డీడీఓ బాధ్యతలను కూడా క్లస్టర్ హెచ్‌ఎంలకే ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

● మూడు క్లస్టర్లుగా...

మండలంలో ఇంతవరకు ఆరు స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహించేవారు. అవి ఇప్పుడు మూడు క్లస్టర్లుగా మారాయి. గతంలో నారన్నాయుడువలస, వంతరాం, బలిజిపేట, పెదపెంకి, అరసాడ, అజ్జాడ స్కూల్ కాంప్లెక్స్‌లుండేవి. వీటిలో నారాన్నాయుడువలస, వంతరాం కాంప్లెక్స్‌లు కలిపి వంతరాం క్లస్టర్‌గా, బలిజిపేట, పెదపెంకి కాంప్లెక్స్‌లు బలిజిపేట క్లస్టర్‌గా, అజ్జాడ, అరసాడ కాంప్లెక్స్‌లు అరసాడ క్లస్టర్‌గా మారాయి.



బలిజిపేట ఉన్నత పాఠశాల క్లస్టర్

సీఆర్పీల భవిష్యత్ ప్రశ్నార్థకం..

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనాంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే స్కూల్ కాంప్లెక్స్‌లను కూటమి ప్రభుత్వం తగ్గించనుంది. ఈ నేపథ్యంలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లను కూడా తగ్గించనున్నట్టు తెలుస్తోంది. ఈ లెక్కన ఆరు స్కూల్ కాంప్లెక్స్‌లకు బదులు మూడు క్లస్టర్లను పునర్నిర్మాణం చేయనున్నారు. దీంతో ఇప్పటి వరకు కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది. సీఆర్పీలకు బీఈడీ అర్హత ఉండడంతో గత ప్రభుత్వం క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు(సీఆర్ఎంటీ)గా గుర్తింపు ఇవ్వడంతో పాటు మండలంలో ఎక్కడైనా ఉపాధ్యాయులు సెలవులో ఉన్నప్పుడు బోధనకు అంతరాయం లేకుండా వీరు పనిచేసేలా చర్యలు తీసుకుంది. ఇప్పుడు క్లస్టర్ విధానం అమలులో వీరి పరిస్థితి ఏమవుతుందనేది స్పష్టంగా తెలియరావడం లేదు.

పని సులభతరం..



క్లస్టర్ విధానంతో పని మరింత సులభతరం అయ్యే అవకాశాలున్నాయి. ఉపాధ్యాయులు కాంప్లెక్స్‌లో ఎక్కువ మంది ఉండే అవకాశాలున్నాయి. దీనివలన ఉపాధ్యాయులలో మంచి నైపుణ్యాలు పెరిగి బోధనకు సహకరిస్తాయి. సీఆర్ఎంటీలతో సహా మరికొన్ని అంశాలకు సంబంధించి పూర్తి సమాచారంపై తదుపరి ఉత్తర్వులు రావాల్సి ఉంది.

సామల సింహాచలం, ఎంఈఓ–1, బలిజిపేట

విలువైన కలప అక్రమ రవాణా

పార్వతీపురం టౌన్: ఒడిశా రాష్ట్రం నుంచి విలువైన వృక్ష సంపదను అక్రమంగా పట్టణంలోకి తీసుకువస్తున్నారు. ఇక్కడ వాటిని ముక్కలుగా చేసి తిరిగి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని సమాచారం. అయితే ఇదంతా అటవీ శాఖాధికారులకు తెలిసే జరుగుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒడిశాలోని అలమండ బ్లాక్ పరిధిలోని విలువైన వృక్షాలను నరికి కప్పవలస మీదుగా గోచక్క గ్రామ సరిహద్దులో గల గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ కలపను సమీప కర్రల డిపోలకు తీసుకువచ్చి చెక్కలు, దుంగలుగా కోసి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్కులు లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఇటీవల మండలంలోని అడ్డాపుశీల కర్రల మిల్లులో విలువైన టేకుజాతి భారీ వృక్షాలు దర్శనం ఇవ్వడమే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వాస్తవానికి అటవీశాఖ అధికారుల లెక్కల్లో కూడా లేని విధంగా భారీ టేకుచెట్లు సామిల్లుల్లో దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా లచ్చిరాజుపేట, కారణమెల్లి డిపోల్లో ఇదే తంతు జరుగుతోందని సమాచారం.

17 మందిపై కేసు నమోదు

సాలూరు: మున్సిపాలిటీ పరిధి గుమడాం గ్రామంలోని నాయుడువీధి, గొల్లవీధులకు చెందిన 17 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 15న నాయుడు, గొల్లవీధులకు చెందిన కొందరు రెండు వర్గాలుగా ఏర్పడి ఘర్షణలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్నారు. వారిని శుక్రవారం స్థానిక తహసీల్దార్ ముందు హాజరుపరిచి, క్రిమినల్ నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

● ఎంపీడీఓ త్రివిక్రమరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టనున్న పంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, పంచాయతీ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, వైద్య సేవలు, ఉపాధిహామీ పనులు, పారిశుధ్య పనులు, రోడ్ల విస్తరణ పనులు చేపట్టడానికి ముందుగా ప్రణాళికలు తయారుచేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఉపాధి ఏపీఓ భాను మాట్లాడుతూ.. ఉపాధి వేతనదారులకు పనులు కల్పించడానికి ముందుగా గ్రామసభల్లో ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని తీర్మానాలు చేశామన్నారు. కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్, ఉపాధిహామీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణాలు వద్దు..



అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శశికుమార్, తదితరులు

● మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్

పార్వతీపురం టౌన్: ఇళ్లకు త్వరగా చేరుకోవాలనే ఉద్దేశంతో ఎక్కువ మంది ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తున్న ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లలో ప్రయాణాలు చేయరాదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శశికుమార్ అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రయాణికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి సొంతూర్లకు వచ్చిన వారు తిరిగి వెళ్లిపోవాలనే ఉద్దేశంతో ఓవర్ లోడ్ వెహికల్స్‌లో ప్రయాణాలు సాగిస్తున్నారని, ఇది మంచిది కాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. సురక్షిత ప్రయాణాలకే మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ. వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనదారుల లైసెన్స్‌లు పరిశీలిస్తున్న ఎస్‌ఐ అనీష్

జియ్యమ్మవలస: మండలంలోని గంగమ్మపేట వద్ద ప్రధాన రహదారిలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఎస్‌ఐ అనీష్ ఆధ్వర్యంలో సిబ్బంది అంతా అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లను పరిశీలించారు. అవేమీ లేని వారికి అపరాద రుసుం విధించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారంతా సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు.



సీతంపేట: వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ అమ్మన్నరావు

సీతంపేట: వాహన తనిఖీల్లో భాగంగా సీతంపేట రోడ్డులో ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తన సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.



భామిని: గురండి కూడలి వద్ద వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్

భామిని: మండలంలోని గురండి కూడలిలో బత్తిలి ఎస్‌ఐ డి.అనిల్‌కుమార్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలతో ప్రయాణిస్తున్న వారికి అపరాద రుసుం విధించారు.

ఓటీపీ చెప్పొద్దు..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మండలంలోని షేక్‌పాడు, రంగుపురం, దండుసూర, గుమ్మిడిగూడ తదితర గ్రామాల్లో పోలీసులు సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ నారాయణరావు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులు, ఫోన్లు, సందేశాలకు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలను తెలియని వారికి చెప్పవద్దన్నారు. లోన్‌యాప్‌లు వినియోగించవద్దన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ కోరారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో గిరిజన రైతులకు రబీ సీజన్ సాగుకు సంబంధించి పలు పంటల విత్తనాల కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట సాగుకు ముందు మట్టి పరీక్షలు చేసుకుని, ఏ నేల ఏ పంట సాగుకు అనువైనదో తెలుసుకుని పండిస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న పొలాల్లో నిమ్మగడ్డి సాగు చేయాలని సూచించారు. కొండ ప్రాంతాల్లో వెదురు సాగుకు రాయితీపై మొక్కలు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.నిర్మలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దండిగాం వంతెన పనులు రద్దు... ఆందోళనలో గిరిజనం

● వంతెన నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం
● గిరిజనుల రాకపోకలు కష్టాల తొలగింపునకు నాటి డిప్యూటీ సీఎం రాజన్నదొర కృషి
● దండిగాం వంతెన రద్దు చేసిన నేటి కూటమి ప్రభుత్వం
● మండిపడుతున్న గిరిజనులు

‘తామంతా వ్యతిరేకించినా పవర్‌ప్లాంట్ నిర్మాణమంటూ సుందరమైన జలపాతాలతో కూడిన ప్రకృతిని అప్పటి టీడీపీ ప్రభుత్వం నాశనం చేసింది. కొండలను పేల్చి రోడ్లను నాశనం చేసింది. వంతెన నిర్మాణాన్ని గాలికొదిలేసింది. మా రాకపోకల కష్టాలను గమనించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంతెన మంజూరు చేసింది. నాటి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కృషితో రూ.8 కోట్లు మంజూరయ్యాయి. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం వంతెనను రద్దుచేసి అన్యాయం చేసింది.’

– దండిగాం పరిసర ప్రాంతాల గిరిజనుల ఆవేదన ఇది.



గత ప్రభుత్వంలో మంజూరైన వంతెనను కూటమి ప్రభుత్వం రద్దుచేసిందంటూ మాజీ డిప్యూటీసీఎం రాజన్నదొర వద్ద వాపోతున్న గిరిజనులు

సాలూరు:

సాలూరు మండలంలోని జలపాతాల్లో దండిగాం జలపాతానికి ప్రత్యేక స్థానం. స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో కొండల మధ్య నుంచి జాలువారే నీటి సవ్వడిని పర్యాటకులు ఆస్వాదించేవారు. 2014–19 మధ్య తోణాం, దండిగాంలలో పవర్ ప్లాంట్ పనులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. స్థానిక రైతులు ఈ నిర్మాణాలను వ్యతిరేకించినా నిర్మాణాలకు అనుమతిచ్చింది. దండిగాంలో మూడు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసే ప్లాంట్ నిర్మాణానికి చుట్టుపక్కల ఉన్న కొండలను, చెట్లను తొలగించారు. హుద్‌హుద్ తుఫాన్‌తో ప్లాంట్ పనులు ఆగిపోయాయి. సువర్ణముఖి నది నీటి ప్రవాహాన్ని ప్లాంట్ పిల్లర్లు కదిలిపోవడం, కాంట్రాక్టర్‌కు నష్టంరావడంతో పనులు సాగించలేదు. పవర్‌ప్లాంట్ ప్రాజెక్టును మధ్యలోనే నిలిపివేశారు. మరోవైపు తోణాం పంచాయతీలో 12 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో మంజూరైన పవర్‌ప్లాంట్ ప్రాజెక్టు సైతం నాటి టీడీపీ ప్రభుత్వంలోనే నిలిచిపోయింది. ఈ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ ఆధీనంలో ఉండడంతో అటవీశాఖ నుంచి అనుమతులు రాలేదు. దండిగాం వద్ద ప్లాంట్ పేరుతో కొండలు, చెట్లు తొలగించడంతో సువర్ణముఖి నది నీటి ఉధృతికి ఇప్పుడు అడ్డుకట్ట వేయలేని పరిస్థితి నెలకొంది. ఒడిశాలో భారీ వర్షాలు కురిస్తే దండిగాం వద్ద నది గుండా రాకపోకలు నిలిచిపోతున్నాయి. కొన్నిసార్లు వాహనాలు సైతం కొట్టుకుపోతున్నాయి. గిరిజనుల రాకపోకల సమస్యను గుర్తించిన నాటి డిపూటీ సీఎం రాజన్నదొర కాజ్‌వే స్థానంలో డబుల్ రోడ్డుతో కూడిన వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎండీఆర్ ప్లాన్ కింద రూ.8కోట్లు మంజూరు చేయించారు. పనులు ప్రారంభమయ్యే సమయానికి ప్రభుత్వం మారడం గిరిజనులకు శాపంగా మారింది. వంతెన పనులను తాజాగా కూటమి ప్రభుత్వం రద్దుచేయడంతో దండిగాం, కురుకూటి, సొంపిగాం, డెన్సరాయి తదితర పంచాయతీల్లోని సుమారు 20కు పైగా గిరిజన గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో ప్రాణాలు పణంగా పెట్టి సువర్ణముఖి నదిలోని కాజ్‌వేపైనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితినెలకొంది. గిరిజనులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు కష్టాలు యథాతథమయ్యాయి.



దండిగాం కాజ్‌వే మీదుగా సువర్ణముఖి పొంగి ప్రవహించడంతో అదుపుతప్పిన ట్రాక్టర్ (ఫైల్)


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంతెన మంజూరు చేస్తూ విడుదలైన జీఓ

గోడు వినిపించిన గిరిపుత్రులు

వంతెన రద్దు విషయం తెలుసుకున్న దండిగాం పరిసర ప్రాంతాల గిరిజనులు తమ గోడును మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు వినిపించారు. వంతెన కష్టాలను తొలగించేందుకు చేసిన కృషి వృథాగా మారిందని వాపోయారు. వంతెన సమస్య పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

చేపపిల్లల విడుదల



చెరువులోకి చేపపిల్లలు విడిచిపెడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి వద్ద కిరండాల్ చెరువులోకి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం చేపపిల్లలు విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఐటీడీఏ గిరిజన ఉప ప్రణాళిక పథకంలో శతశాతం సబ్సిడీతో గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లోని మొత్తం 151 చెరువుల్లో 7,12,000 చేపపిల్లలను విడిచిపెట్టడం జరిగిందని తద్వారా 428 గిరిజన మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుతం కిరండాల్ చెరువులో 25 వేల చేపపిల్లలు విడిచిపెట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ క్రాంతికుమార్, జిల్లా మత్స్యకార సంఘ నాయకులు సురేష్, వెంగళరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com